సాక్షి
నంద్యాల
బుధవారం ৷ 24 ৷ మే ৷ 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



ఎండలు బాబోయ్..

కర్నూలు (అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉంది. మంగళవారం చాగలమర్రిలో 43.23 డిగ్రీల నమోదైంది.



కుక్కలకూ ఉంది ఓ హాస్టల్ !

ప్రేమతో కుక్కలను పెంచుకునే వారి సౌలభ్యం కోసం ఓ యువకుడు కుక్కలకు హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఎవ్వరైనా ఊళ్లకు వెళ్లేటప్పుడు కుక్కలను ఇక్కడ వదిలేస్తే ఆలనాపాలనా చూస్తారు. 8లో..

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

గోస్పాడు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్):మోడల్ స్కూళ్లలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం, 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి ఈనెల 25వ తేదీ లోపు, ఇంటర్‌కు జూన్ 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని 20 మోడల్ స్కూళ్లు ఉండగా, 6వ తరగతికి ఒక్కో పాఠశాలలో 100 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే 19 ఇంటర్మీ డియెట్ మోడల్ కళాశాలల్లో ఒక్కొక్క గ్రూపునకు 40 సీట్లు మేర నాలుగు గ్రూపుల్లో 160 సీట్లు ఉన్నాయన్నారు.

జూన్ 7 నుంచి హజ్ యాత్రలు ప్రారంభం

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్రికుల కోసం జూన్ 7వ తేదీ నుంచి విమానాలు బయలుదేరుతాయని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మొహమ్మద్ యాకూబ్ షేఖా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుంచి జూన్ 22వ తేదీ వరకు ప్రతి రోజు 155 మంది యాత్రికులతో నేరుగా సౌదీ అరేబియాలోని జెద్దా విమానాశ్రయానికి విమానాలు చేరుకుంటాయని, 41 రోజుల యాత్ర అనంతరం జూలై 17వ తేదీ నుంచి మదీనా నుంచి నేరుగా విజయవాడకు తిరిగి వస్తాయన్నారు. ఈ విషయాన్ని యాత్రికులు గమనించి సేవలు అందించే హజ్ సొసైటీల ద్వారా ప్రయాణ తేదీలను తెలుసుకోవాలని సూచించారు.

క్వింటా పత్తి రూ.7,069

ఆదోని అర్బన్: పత్తి ధర క్రమంగా తగ్గుముఖం పడుతోంది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గత వారం రూ.7,538 ధర పలుకగా.. మంగళవారం రూ.7,069కు చేరింది. యార్డుకు 2,029 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా.. గరిష్ట ధర రూ.7,069, మధ్య ధర రూ.6,889, కనిష్ట ధర రూ.4,556 నమోదైంది. గత రెండు వారాల క్రితం క్వింటా పత్తి ధర రూ.8,200 పలకడంతో చాలా మంది రైతులు మరింత పెరుగుతుందనే ఆశతో ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. అయితే ధర మరింత పడిపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

అలా నడిపించారు!

యువగళం పాదయాత్ర జిల్లాలో 40 రోజుల పాటు సాగిందంట. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి తనయుడు లోకేశ్ పాదయాత్ర చేశారంట. నిజమేనా? అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. టీడీపీ నేతలు ఏదో ఊహించుకుంటే, ఇక్కడ ఏదో జరిగింది. జనం నుంచి స్పందన లేక.. మాట్లాడే మాట అర్థం కాక.. ఫ్లెక్సీల మధ్య వంద మంది జనంతో సభలను మమ అనిపిస్తూ.. ఈవినింగ్ వాక్‌ను తలపించే పాదయాత్ర జిల్లాలో నవ్వులపాలైంది. అడుగడుగునా కనిపించే అభివృద్ధిని జీర్ణించుకోలేక, ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యేలపై నాలుగు రాళ్లేయడంతో లోకేశ్ యాత్ర ముగిసింది. ఎవరో రాసిచ్చిన స్పీచ్‌ను కూడా సరిగా చదవలేక.. అందులోని వాస్తవాలను సరిచూసుకోకపోవడం మొదటికే మోసం తీసుకొచ్చింది. ఇంతేనా.. ప్రతీ నియోజకవర్గంలో నేతల మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమనడం గమనార్హం. – సాక్షి ప్రతినిధి, కర్నూలు

ముగిసిన లోకేశ్ పాదయాత్ర

- 40 రోజుల పాటు చుక్కలు చూసిన పార్టీ నేతలు
- జనం తరలింపునకు ప్రతీ నియోజకవర్గంలో పాట్లు
- రోజుకు రూ.500 కూలీ ఇచ్చినా ముందుకురాని జనం
- విధిలేని పరిస్థితుల్లో ఈవినింగ్ వాక్‌తో సరి
- నేతల మధ్య విభేదాలకు ఆజ్యం పోసిన యాత్ర
- అవగాహన లేని మాటలతో అభాసుపాలు



టీడీపీ నేత నారా లోకేశ్ చేపట్టి పాదయాత్ర ఏప్రిల్ 13న అనంతపురం జిల్లా నుంచి నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోకి చేరింది. 14 నియోజకవర్గాల్లో సాగిన యాత్ర మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గం దాటి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సుద్దపల్లికి చేరింది. 40 రోజుల పాటు సాగిన పాదయాత్రను టీడీపీ శ్రేణులు పెద్ద ప్రహసనంలా నిర్వహించారు. జనాల తరలింపునకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున కూలీ చెల్లించేందుకు.. ఉదయం, సాయంత్రం వెయ్యి మంది కనిపించేలా చూసుకునేందుకు నేతలు పడిన కష్టం అంతాఇంతా కాదు. కూలీ చెల్లించినా జనాల్లో ఆసక్తి లేక ఎమ్మిగనూరు సభ అట్టర్‌ఫ్లాప్ కావడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పట్టింది. పాదయాత్రలో కూడా దారిలో కలిసే కులాలు, సంఘాలు, గ్రామాల వ్యక్తులను సాధారణంగా వచ్చే వారిని కాకుండా 'ప్రత్యేకంగా అరేంజ్' చేసిన వారితో నడిపించారు. దీంతో యాత్ర సహజత్వాన్ని కోల్పోయి నేతలకు విసుగుతెప్పించింది. ముఖాముఖి కార్యక్రమాలు కూడా పూర్తిగా టీడీపీ కార్యకర్తలు, సానుభూతి పరులతో నడిపించారు.

బహిరంగసభ అర్థాన్నే మార్చేసిన లోకేశ్

జనాలు రాకపోవడంతో బహిరంగసభ అర్థాన్నే లోకేశ్ మార్చేశారు. ఇప్పటి వరకు సభ అంటే ఒక గ్రౌండ్ తీసుకుని వేదిక ఏర్పాటు చేస్తే ప్రాంగణం జనంతో నిండిపోయేది. కానీ లోకేశ్ యాత్రలో నిర్వహించిన సభలు మొత్తం సగటున 60 అడుగుల వెడల్పు, 160 అడుగుల పొడవుతో చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అందులో కొంతమందిని తరలించి దాన్నే బహిరంగసభలా నిర్వహించారు. ఎమ్మిగనూరులో 80''170, కోడుమూరులో 60''160, పాణ్యంలో 60''120, శ్రీశైలంలో 60''120 లెక్కన వేదికలు ఏర్పాటు చేశారు. ఇలా బహిరంగసభను నిర్వహించింది రాష్ట్ర చరిత్రలో లోకేశ్ ఒక్కరే కావడం గమనార్హం.

ఈవినింగ్ వాక్‌లా పాదయాత్ర


కర్నూలు జిల్లాలో ఉదయం, సాయంత్రం యాత్ర నిర్వహించారు. రోజుకు సగటున 10కిలోమీటర్ల మేర నడిచారు. జనాలు రాకపోవడంతో లోకేశ్, ఆయన బృందం, వందమంది కూడా కార్యకర్తలు లేకుండా యాత్రలు నడిచాయి. దీంతో ఆత్మకూరు నుంచి ఉదయం పూట యాత్రకు ఫుల్‌స్టాప్ పెట్టారు. కేవలం సాయంత్రం 4గంటల తర్వాత ఒక పూట మాత్రమే యాత్ర నిర్వహిస్తున్నారు. దీంతో పాదయాత్ర కాస్త 'ఈవినింగ్ వాక్'ను తలపిస్తోంది.



పశ్చిమప్రాంత రైతాంగానికి మేలు చేసే పులికనుమ ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాణప్రతిష్ట చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.263 కోట్లు కేటాయించారు. ముఖ్యమంత్రి హోదాలో 2008 సెప్టెంబర్ 21న పులికనుమ ప్రాజెక్టుకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు.

ఇదీ నిజం!

2014లో అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు పులికనుమ ప్రాజెక్టు మిగులు పనులకు (ఎల్లెల్సీ నుంచి పులికనుమ వరకు అప్రోచ్ కెనాల్ తవ్వటం) రూ.24కోట్లు కేటాయించి ప్రారంభోత్సవం చేశారు. అయితే ఇది తమ ఘనతగా లోకేశ్ చెప్పుకోవడం హాస్యాస్పదం.



గోనెగండ్ల మండలం వేముగోడు – తిప్పనూరు మధ్య తిప్పనూరు బ్రిడ్జిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.9కోట్లతో నిర్మిస్తే అది కూడా తమ ఘనతేనంటూ చెప్పుకోవడం పట్ల ప్రజలు నవ్వుకున్నారు.

అవగాహన లేమితో అభాసుపాలు

పాదయాత్రలో లోకేశ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు అతన్ని అభాసుపాలు చేశాయి. స్వతహాగా అవగాహన లేకపోవడం, స్థానికంగా ఇన్‌చార్జ్‌లను కాకుండా తాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న టీం ఇచ్చిన నోట్స్ చదవడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ అభివృద్ధిపై సత్యదూర వ్యాఖ్యలు చేశారు. కోడుమూరు సభలో గోరంట్ల బ్రిడ్జి నిర్మిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారని, టీడీపీ అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని లోకేశ్ అన్నారు. వాస్తవానికి బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.24కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను ఓఎంఆర్ కన్‌స్ట్రక్షన్ చేస్తోంది. శంకుస్థాపన కోసం ఆర్థికశాఖ మంత్రి బుగ్గనతో పాటు ఎమ్మెల్యేలు సుధాకర్, శ్రీదేవి, కుడా చైర్మన్‌కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కూడా హాజరయ్యారు. లోకేశ్ తప్పులు మాట్లాడినా వాస్తవాలు స్థానికంగా ఉన్న ప్రజలకు తెలుసుకాబట్టి నియోజకవర్గంలో అభాసుపాలయ్యాడు. చివరకు డోన్‌లో జరిగిన ఎస్సీల ముఖాముఖిలో విదేశీ విద్య గురించి మాట్లాడుతూ 'దళితులు పీకింది, పొడిచింది ఏమీ లేదని, తాను దానిపై పోరాటం చేశాన'ని అన్నారు. దీనిపై జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఎమ్మెల్యేలు కూడా అవినీతికి పాల్పడ్డారంటూ తప్పుడు ఆరోపణలు చేశారు. దీనిపై ఎమ్మెల్యేలు వాస్తవాలను వివరిస్తూ ధ్వజమెత్తారు. దీనికి కనీసం ఆధారాలు చూపించి గట్టి కౌంటర్ కూడా టీడీపీ నేతలు ఇవ్వలేకపోయారు.

విభేదాలు.. తన్నులాటలు

- పాదయాత్ర మొదలైన రోజు నుంచి అడుగడుగునా వర్గ విభేదాలు లోకేశ్‌కు తలనొప్పిగా మారాయి.
- డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి, కేఈ ప్రభాకర్ వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. సుబ్బారెడ్డికి సహకరించే ప్రసక్తే లేదని కేఈ వర్గం తేల్చి చెప్పింది. కరపత్రాలు పంపిణీ చేసింది.
- ఆలూరులో కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున, వీరభద్రగౌడ్, శివప్రసాద్ ఎవరికి వారు వర్గాలుగా విడిపోయారు. దేవనకొండ క్రాస్‌లో కోట్ల, శివప్రసాద్ వర్గాల మధ్య గొడవ జరిగింది.
- మంత్రాలయంలో తిక్కారెడ్డి, ఉలిగయ్య, ముత్తురెడ్డి వర్గాలు కర్రలతో దాడి చేసుకున్నారు.
- ఎమ్మిగనూరులో ఐదు రోజులు యాత్ర సాగితే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన వర్గం పూర్తిగా గైర్హాజరయ్యారు.
- కోడుమూరులో లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలకడం మినహా యాత్ర జరిగిన రెండురోజులు లోకేశ్‌తో కలిసి ఇన్‌చార్జ్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి అడుగు కూడా నడవలేదు. కోడుమూరు బహిరంగసభలోనూ కన్పించలేదు.
- నంద్యాలలో ఏవీ సుబ్బారెడ్డిపై అఖిల ప్రియ, ఆమె వర్గం భౌతికంగా దాడి చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో అఖిల రిమాండ్‌కు వెళ్లింది.



వంతెనకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ సంజీవకుమార్, ఎమ్మెల్యేలు తదితరులు (ఫైల్)

మహానందీశ్వరా నీవైనా చెప్పయ్యా!

- క్యూలైన్లలో ఫ్యాన్లు లేక భక్తుల అవస్థలు

మహానంది: వేసవి సెలవుల నేపథ్యంలో మహానంది క్షేత్రానికి రోజూ భక్తులు పోటెత్తుతున్నారు. రద్దీ నేపథ్యంలో స్వామి, అమ్మవార్ల దర్శనం సుమారు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. అసలే వేసవికాలం, ఆపై రేకులషెడ్ల కింద క్యూలైన్లు ఉండటంతో ఎండవేడిమితో భక్తులు ఉక్కపోతకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అధికారులు, సిబ్బంది మాత్రం కార్యాలయంలో ఏసీలు, కూలర్లు ఏర్పాటు చేసుకుంటే భక్తులకు మాత్రం ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రూ.కోట్లలో ఆదాయం వచ్చే దేవస్థానంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ఫ్యాన్లు లేని రేకుల షెడ్డు కింద క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

సివిల్స్ ఆణిముత్యాలు

కర్నూలు(రాజ్‌విహార్)/ఆదోని అర్బన్: సివిల్స్ ఫలితాల్లో కర్నూలు జిల్లాకు చెందిన ఇరువురు కుర్రాళ్లు సత్తా చాటారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన డాక్టర్ షేక్ హబీబుల్లా ఆల్ ఇండియా స్థాయిలో 189వ ర్యాంకు సాధించారు. తండ్రి షేక్ అబ్దుల్ ఖాదర్ ప్రస్తుతం విద్యుత్ శాఖ ట్రాన్స్‌కోలో సూర్యపేట ఏడీఈగా విధులు నిర్వహిస్తుండగా తల్లి షేక్ గౌసియా బేగం గృహిణి. సివిల్స్ లక్ష్యంగా శ్రమించి మూడో ప్రయత్నంలో 189వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో నివాసముంటున్న నరసింహులు, ఉషా దంపతుల కుమారుడు షమీర్‌రాజా మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆల్‌ఇండియా స్థాయిలో 464వ ర్యాంకు సాధించారు. 2020లో 603 ర్యాంకు సాధించిన షమీర్ ప్రస్తుతం ఢిల్లీలోని ఇండియన్ సివిల్ అకౌంట్ సర్వీస్‌లో పని చేస్తున్నాడు. ఇతని తండ్రి నరసింహులు గుంతకల్ రైల్వేశాఖలో డీఆర్‌ఎం ఆఫీసు సూపరింటెండెంట్‌గా కాగా.. తల్లి గృహిణి. చెల్లెలు షరిమ్మల ఎంబీబీఎస్ పూర్తి చేసి రేడియాలాజీలో ఎండీగా శిక్షణ పొందుతోంది.



షేక్ హబీబుల్లా (189వ ర్యాంక్)



షమీర్‌రాజా (464వ ర్యాంకు)

గిరిజన గురుకులాల్లో బదిలీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే సిబ్బందికి బదిలీలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, కర్నూలు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో బోధన, బోధనేతర సిబ్బందికి ఈ బదిలీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఒకే పాఠశాలలో రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని, 26న అభ్యంతరాల స్వీకరణ, 27న అభ్యంతరాల పరిష్కారం, జాబితా ప్రదర్శన ఉంటుందన్నారు. ఈనెల 30, 31వ తేదీల్లో బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు

- పేదలకు మంచి జరిగితే టీడీపీ నాయకులకు కడుపు మంట
- అప్పటి ప్రభుత్వం సెంటు భూమి ఇవ్వలేదు
- పేదలకు పక్కా ఇల్లు నిర్మించడమే జగనన్న లక్ష్యం
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి

బొమ్మలసత్రం: 'పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మెడికల్ కళాశాల నిర్మిస్తుంటే జీర్ణించుకోలేక పోయారు.. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని చూస్తే సహించలేకపోయారు.. కోర్టులకెళ్లి రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు' అంటూ నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి టీడీపీ నాయకులనుద్దేశించి విమర్శించారు. దేవుడు ఎప్పుడు మంచి చేసే వారు వైపు ఉంటారని, దేవుని ఆశీస్సులతో నేడు పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. నంద్యాల శివారులోని ఎస్పార్బీసీ కాలనీలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో మంగళవారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తదితరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అర్హులైన లబ్ధిదారులకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో అప్పటి మంత్రి శిల్పామోహన్‌రెడ్డి నంద్యాల ప్రాంత ప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ నంద్యాల ప్రజలకు ఒక్క సెంటు భూమి ఇచ్చిన పాపానపోలేదన్నారు. పట్టణంలో అర్హులైన పేదల కోసం కుందూనది సమీపంలో జగనన్న కాలనీ లేఅవుట్ గుర్తిస్తే టీడీపీ నాయకులు నది పక్కన పట్టాలు ఇవ్వడమేంటని కోర్టుకెళ్లి అడ్డుకున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కరకట్ట మీద ఇళ్లు కట్టుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు కానీ, అదే పేదలు కుందూనదికి 200 మీటర్ల దూరంలో పట్టాలు పొందితే అడ్డుకోవడం ఎంత వరకు సబబు అన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌షావలి, డైరెక్టర్లు కల్లూరి రామలింగారెడ్డి, శశికళారెడ్డి, సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, ఆర్డీవో శ్రీనివాసులు, కమీషనర్ రవిచంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి ఇంటి పట్టా అందజేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా, కలెక్టర్ మనజీర్ జిలానీ



కార్యక్రమానికి భారీగా హాజరైన ప్రజలు



జగనన్న లేఅవుట్ వద్ద ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి సెల్ఫీ

విడతల వారీగా పట్టాల పంపిణీ

నంద్యాల జిల్లాలో ప్రభుత్వ భూములు తక్కువగా ఉన్నాయని విడతల వారీగా అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం నంద్యాల నియోజకవర్గంలో ఇప్పటికే 5,295 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుతం కర్నూలు హైవే సమీపంలో 108 ఎకరాల్లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో మొదటి విడత 3,006 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. రెండవ విడతగా 1,209 పట్టాలు సిద్ధం చేసి అతి త్వరలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పట్టాల పంపిణీకి ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని వివరించారు. పేదలకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చేలా కృషి చేసిన లాయర్లు, రెవెన్యూ, కాలుష్యనియంత్రణ, మండలి తదితర అధికారులు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. లబ్ధిదారులు ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని, త్వరలో కుందూనదిపై బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

జిల్లాలో అభివృద్ధి పరుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి పాలనలో రైల్వే, జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతుందని దీంతో ప్రతి జిల్లా అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రోజు వచ్చిందని అందరూ పండుగల ఈ పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఇప్పటికే మెడికల్ కళాశాల భవనాన్ని నిర్మిస్తుందని దీంతో పాటు నివసించేందుకు ఉచితంగా పట్టాలు, గృహాలు అందజేస్తుందన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల మధ్య తేడా ప్రజలే గమనించాలని వివరించారు. అభివృద్ధి అంటే హైటెక్‌సిటీ నిర్మించడం కాదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గా ప్రజల అభ్యున్నతి ముఖ్యమన్నారు. నంద్యాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శిల్పామోహన్‌రెడ్డి హయాంలో జరిగిన పట్టాల పంపిణీ తర్వాత ఆయన కుమారుడు రవిచంద్రకిషోర్ రెడ్డి ఎమ్మెల్యేగా మళ్లీ ఇప్పుడు పేదలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

పేదల చదువుకు ప్రభుత్వ దీవెన

- నేడు జగనన్న విద్యాదీవెన రెండో విడత నిధుల విడుదల
- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి ప్రారంభించనున్న సీఎం
- జిల్లాలో 28,486 మంది విద్యార్థులకు లబ్ధి

నంద్యాల: చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు మొత్తాన్ని ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తోంది. చెప్పిన తేదీకి, చెప్పిన విధంగా ఫీజులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 19న జగనన్న విద్యా దీవెన పథకం మొదటి విడత నిధులు జమ చేసింది. రెండో విడత తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన డబ్బులను వారి ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేయనున్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు ధీమా కల్పించడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు ప్రతి ఏడాది నాలుగు దఫాలుగా జమ చేస్తున్నారు. ఈ ఏడాది రెండో విడత బుధవారం జమ చేయనున్నారు. ఈ ఏడాది నంద్యాల జిల్లాలో 28,486 మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హత సాధించారు. ఈ మేరకు రూ.23.91 కోట్లు లబ్ధిదారులకు చేరనుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిష్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన 28,486 మంది విద్యార్థినీ, విద్యార్థులకు చెందిన 25,576 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.23.91 కోట్లు జమ కానున్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ, పీహెచ్‌డీ వరకు చదివే విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.



విద్యార్థులు(ఫైల్)

పేదల చదువుకు ప్రాధాన్యత



పేదల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న జగనన్న విద్యా, వసతి దీవెన పొందేందుకు ఆయా కళాశాలల్లో విద్యార్థుల హాజరు 75 శాతం కచ్చింతగా ఉండాలి. తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్న ఫీజు మొత్తాన్ని ఏడు రోజుల్లోగా సంబంధిత కళాశాలల్లో జమ చేయాలి. అర్హులైన విద్యార్థులు గ్రామ/వార్డు సచివాలయాల్లోను, తాము చదువుతున్న కళాశాలల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. విద్యా దీవెన పొందేందుకు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరించేందుకు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌ను సంప్రదించవచ్చు. – చింతామణి, సోషల్ వెల్ఫేర్ డీడీ నంద్యాల

బ్రీడ్ శ్యాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపండి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సిద్ధం చేసిన విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మ పోషకాలను ఆయా కంపెనీలు బ్రీడ్ శ్యాంపిల్ తీసి నియోజకవర్గాల వారీగా ఉన్న వైఎస్‌ఆర్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల్లో పరీక్షలకు పంపాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రతి నెల విధిగా 25 శ్యాంపిల్ పంపాల్సి ఉందన్నారు. ఇందుకు రుసుము రూపంలో వచ్చే మొత్తంతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించుకోవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ యంత్రాంగం ఈ చర్యలు తీసుకుందని చెప్పారు. ఎరువులు, విత్తనాలు నియోజకవర్గాల్లోని ల్యాబ్‌లకు, పురుగు మందులను ఎమ్మిగనూరులోని ల్యాబ్‌కు పంపాల్సి ఉందని పేర్కొన్నారు. కంపెనీలు బ్రీడ్ శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపడాన్ని మండల వ్యవసాయ అధికారులు, సబ్ డివిజనల్ ఏడీఏలు పర్యవేక్షించాలని సూచించారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఎటువంటి అనుమానం వచ్చినా నియోజకవర్గాల వారీగా ఉన్న ల్యాబ్‌ల్లో ఉచితంగా పరీక్షించుకునే అవకాశం ఉందన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశెనగ	4068	7890
పొద్దుతిరుగుడు	4269	4369
ఆముదం	4719	5334
వాము	5400	24199
ఉల్లి	365	435
ఎండుమిర్చి	5599	23309
శనగలు	4311	4610
కందులు	7490	8806
మొక్కజొన్న	1312	1789
మినుములు	6900	7290

కుక్కలకూ ఉంది ఓ హాస్టల్ !

కొందరు కుక్కలను చాలా ఇష్టంగా పెంచుకుంటారు. కానీ వారు ఎప్పుడైనా ఊళ్లకు, టూర్లకు వెళ్లాల్సి వస్తే వెంట తీసుకెళ్లలేరు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ ఓ యువకుడు సరికొత్త వ్యాపారం ప్రారంభించాడు. ఎవ్వరైనా ఊళ్లకు వెళితే వాటి ఆలనాపాలనా మేము చూస్తామంటూ కుక్కలకు హాస్టల్ ఏర్పాటు చేశాడు.

- డిగ్రీ చదివిన యువకుడి వినూత్న వ్యాపార ఆలోచన
- కుక్కల పెంపకంపై ఆసక్తితో కర్నూలు శివారులో హాస్టల్ ఏర్పాటు
- ఊర్లకు వెళ్లే వారి పెంపుడు కుక్కలకు వసతి సౌకర్యాలు
- అన్నపాన స్నానాధికాలతో సేవలు


కుక్కలకు సేవ చేస్తున్న సహాయకులు


కుక్కకు గ్రూమింగ్ చేస్తున్న దృశ్యం


కుక్కల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

కర్నూలు(హాస్పిటల్): గోనెగండ్లకు చెందిన వి.రవిప్రకాష్ కర్నూలులో బీఎస్సీ బయోకెమిస్ట్రీ వరకు చదువుకున్నాడు. అతని తండ్రి చిన్న ఓబులేసు వ్యవసాయం చేస్తున్నాడు. తల్లి నాగరత్నమ్మ గృహిణి, తమ్ముడు బాలు డిగ్రీ పూర్తి చేసి తండ్రికి సాయంగా వ్యవసాయం చేస్తున్నాడు. ఇద్దరు అక్కా చెల్లెళ్లకు వివాహమైంది. రవిప్రకాష్ 2016లో డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. అతను చదివిన కళాశాలలో చేసిన డిగ్రీ కారణంగా అతనికి మంచి కంపెనీలో ఉద్యోగం లభించేది. కానీ అతనికి చిన్నతనం నుంచి కుక్కలపై ఉన్న ఆసక్తి వ్యాపారంపై దారిమళ్లించింది. చిన్నతనం నుంచి కుక్కల జాతులు, వాటి రకాలు, ఏఏ జాతులు ఎలా ఉంటాయి, ఎలా వ్యవహరిస్తాయి, వాటి ఆహారం, అభిరుచులు, వాటితో ఎలా మెలగాలి, ఎలా మచ్చిక చేసుకోవాలనే విషయాలపై బాగా అధ్యయనం చేశాడు. కుక్కలతోనే తన జీవితమని,తాను బాగుపడ్డా వాటితోనే అని రవిప్రకాష్ నిర్ణయించుకున్నాడు.

కుక్కలకూ ప్రత్యేకంగా హాస్టల్

సాధారణంగా చదువుకునే విద్యార్థులకు హాస్టళ్లు ఉంటాయి. అలాగే వర్కింగ్ ఉమెన్, మెన్స్‌కు హాస్టళ్లు ఉంటాయి. నిర్ణయించిన మేర ఫీజు చెల్లిస్తే వాటిలో ఫుడ్, బెడ్డు సౌకర్యం కల్పిస్తారు. అంతేకాదు సేఫ్టీ కూడా ఉంటుంది. ఇదే తరహాలో కుక్కల కోసం హాస్టల్ ఏర్పాటు చేయాలని భావించాడు రవిప్రకాష్. 2017లో కర్నూలు నగర శివారులోని సల్కాపురం వద్ద అర ఎకరా స్థలంలో 11 షెడ్లతో కుక్కలకు ప్రత్యేక వసతులు కల్పించాడు. కొన్ని రకాల కుక్కలు ఎక్కువ ఎండవేడిమి తట్టుకోలేవు. అలాంటి వాటి కోసం కూలర్లు కూడా ఏర్పాటు చేశాడు. వారి వద్ద వదిలిన కుక్కల ఆలనా పాలనా చూసుకునేందుకు తనతో పాటు మరో ఇద్దరిని ఉద్యోగంలో ఉంచుకున్నాడు. ఆ కుక్కలకు స్నానం చేయించడం, హెయిర్ గ్రూమింగ్(వెంట్రుకలు కత్తిరించడం) చేయడం, వాటికి సమయానికి ఆహారాన్ని అందించడం ఏదైనా అనారోగ్యం కలిగితే వైద్యుల వద్దకు తీసుకెళ్లడం చేస్తుంటారు. ఎవ్వరికైనా ఫలానా జాతి కుక్క కావాలంటే దానిని తెప్పించి ఇవ్వడమే గాక వాటిని ఎలా పెంచాలో కూడా అవగాహన కల్పిస్తున్నారు.

రాత్రింబవళ్లూ సేవ చేస్తాం


మా వద్ద వదిలిన కుక్కలను రాత్రింబవళ్లు కాపు కాసి వాటి బాగోగులు చూస్తాము. వాటిని ఎలా పెంచాలి, ఎలాంటి ఆహారం తినిపించాలి, వాటి లక్షణాలు ఎలా ఉంటాయి, ఏ సమయంలో వాటికి టీకాలు వేయించాలి వంటి విషయాలపై అవగాహన కల్పిస్తాం. సీజనల్ వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతాము. జంతువులను ఎవ్వరికీ బహుమతి రూపంలో ఇవ్వకండి. ఎందుకంటే బహుమతి అందుకున్న వ్యక్తులకు వాటి పట్ల మక్కువ లేక వదిలించుకునే ప్రమాదం ఉంది. –రవిప్రకాష్, వసతి గృహం నిర్వాహకుడు

ఐదారుసార్లు మా పెట్‌ను వదిలివెళ్లాం


మా పెట్‌ను టూరుకు వెళ్లేటప్పుడు దాదాపు ఐదారుసార్లు డాగ్ హాస్టల్‌లో వదిలివెళ్లాము. అన్నిసార్లు వారు హాస్టల్‌లో మా పెట్‌ను బాగా చూసుకున్నారు. ఇంట్లో మేము ఏ ఆహారం ఎలా పెడతామో తెలుసుకుని వారు దానికి అలాగే పెట్టేవారు. ఎప్పుడైనా మాపై బెంగతో ఆహారం తినకపోతే వీడియోకాల్ చేసి పెట్‌కు చూపించేవారు. వీడియోకాల్‌లో మా పెట్‌తో మేము మాట్లాడేవాళ్లం. దాంతో అది ఆనందపడి ఆహారం తినేది. –హరిహరన్, కర్నూలు

ఎలా పెంచాలో అవగాహన కల్పించారు


మా వద్ద ఇండియన్ స్పిట్ జాతి కుక్క ఉంది. 10 ఏళ్లుగా దానిని మేము పెంచుకుంటున్నాము. మేము ఊళ్లకు వెళ్లే సమయంలో చాలా సార్లు డాగ్ హాస్టల్‌లో వదిలివెళ్లేవాళ్లం. అక్కడ వారు బాగా చూసుకునే వారు. ఏదైనా అనుమానం వస్తే మాకు ఫోన్ చేసి తెలుసుకునేవారు. దానికి ఎలాంటి ఆహారం తినిపిస్తే బాగుంటుంది, దానితో ఎలా వ్యవహరించాలి, దాని లక్షణాలు ఏంటి తదితరవి వివరించి చెప్పేవారు. కుక్కల గురించి మాకు తెలియని విషయాలు ఎన్నో వారి వద్ద నుంచి నేర్చుకున్నాము. –ప్రదీప్, కర్నూలు

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

కోసిగి/ఆదోని సెంట్రల్: మండల కేంద్రం కోసిగి రైల్వే స్టేషన్ సమీపంలో 523/23 మైలు రాయి వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని రైల్వే పోలీసులు మంగళవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి 25 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉంటుంది. కిందపడినప్పుడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఛాతి మీద కన్నడలో చిట్టి అని, కుడి చేతి పై జీపీ అని ఇంగ్లిష్‌లో, ప్రేమ అని కన్నడతో పచ్చబొట్టు వేసుకుని ఉన్నాడన్నారు. దీనిని బట్టి మృతుడు కర్ణాటక వాసిగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వర రావు తెలిపారు. మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఉంచామని తెలిసిన వ్యక్తులు ఉంటే సంప్రదించాలని సూచించారు.

బదిలీలకు ముమ్మర కసరత్తు

కర్నూలు(అగ్రికల్చర్): వివిధశాఖల్లో బదిలీలకు ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. ఒకేచోట ఐదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు విధిగా బదిలీ కావాల్సి ఉంది. రెండేళ్లుగా పనిచేస్తున్న వారు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. పశుసంవర్ధకశాఖలో బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ మొదలు కానుంది. ఆఫీసు సబార్డినేట్లు, వెటర్నరీ అసిస్టెంట్ల బదిలీలను ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా చేపడుతున్నాయి. జిల్లా స్థాయిలో బదిలీల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. కర్నూలు జిల్లా పశుసంవర్ధక అధికారి చైర్మన్‌గా, నంద్యాల జిల్లా అధికారి మెంబర్‌గా, గజిటెడ్ మేనేజర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జోనల్, స్టేట్ క్యాడర్ బదిలీలను విజయవాడలోని పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్నారు. బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులతో జిల్లా అధికారులు రావాలని, దరఖాస్తు చేసుకున్న వారు రావాల్సిన అవసరం లేదని సూచించారు. మార్కెటింగ్ శాఖలో ఈ నెల 25న గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌లో నిర్వహించనున్నారు. వ్యవసాయ శాఖలో ఐదేళ్ల పైబడి ఒకే చోట పనిచేస్తున్న వారిలో ఏఓలు 5గురు, ఏడీఏల్లో ఒకరు ఉన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు వేళాయె

కర్నూలు(సిటీ): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ రంగం సిద్ధమైంది. జిల్లాలో సుమారుగా 1400 మంది టీచర్లు బదిలీ అయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో బదిలీల దరఖాస్తుల వెబ్‌సైట్ ఓపెన్ కానుంది. మూడు రోజుల పాటు దరఖాస్తులు చేసుకోవాలి. ఈనెల 25, 26, 27 తేదీల్లో టీచర్ల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు 28, 29 తేదీల్లో ప్రదర్శించనున్నారు. 30వ తేదీన అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఆ తర్వాత మార్పులు చేర్పులకు ఈనెల 31, జూన్ 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. జూన్ 2, 3 తేదీల్లో తుది సీనియారిటీ జాబితాతో పాటు ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్స్‌ను ప్రదర్శించనున్నారు. వచ్చే నెల 4న ఖాళీల జాబితా ప్రకటిస్తారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు 5, 6 తేదీల్లో, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు 5,6,7 తేదీల్లో, ఎస్‌జీటీ టీచర్లు 5,6,7,8 తేదీల్లో ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత 9వ తేదీన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, ఎస్‌జీటీ టీచర్ల జాబితాలు జనరేట్ అవుతాయి.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- 30న పత్తికొండకు సీఎం రాక
- సభ, హెలిపాడ్ ఏర్పాటుకు కలెక్టర్, ఎమ్మెల్యే స్థల పరిశీలన


ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటన ఈనెల 30వ తేదీన ఖరారు కావడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం పత్తికొండలో సభ, హెలిపాడ్‌కు స్థల పరిశీలన చేశారు. స్థానిక కర్నూ లు రోడ్డులోని సెయింట్‌జోసెఫ్ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, ఆదోని రోడ్డులోని సెయింట్ పీటర్స్ బీఈడీ కళాశాల మైదానం, గుత్తిరోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం, అలాగే వ్యవసాయ మార్కెట్‌యార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అధికారులతో సీఎంసభ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండ సభ నుంచి వైఎస్సార్ రైతుభరోసా ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారిగా పత్తికొండకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సీఎం పాల్గొనే సభ, హెలిపాడ్ కోసం నాలుగు స్థలాలను పరిశీలించామని, వాటి విస్తీర్ణం, ఆయా మైదానాల్లో ఉన్న గేట్లు తదితర వివరాలతో మ్యాపింగ్ తయారుచేసి నివేదిక ఇచ్చేలా అధికారులను ఆదేశించామన్నారు. జిల్లా వ్యాప్తంగా సభకు వచ్చే రూట్లు, హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులకు అవసరమైన ఏర్పా ట్లు, వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి సౌకర్యం, అలాగే వైద్యసదుపాయాలు అన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాసు, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి వరలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు


మాట్లాడుతున్న ఈడీ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): జిల్లాలో షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సేవా సహకార సంస్థకు చెందిన ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సులు ఉన్నాయని, వీటికి రిపేర్లు చేయించడంతో పాటు నిరుపయోగంగా ఉన్న వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామన్నారు. ముఖ్యంగా ఎన్‌ఎస్ఎఫ్‌డీసీ, ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద రుణాలు పొందిన లబ్ధిదారుల నుంచి రికవరీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్‌ఎస్ఎఫ్‌డీసీ కింద రూ.27.39 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.6.92 కోట్లు రికవరీ చేశామన్నారు. అలాగే ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ కింద రూ.1.59 కోట్లకు గాను రూ.34 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ–ఆటో, మెకనైజ్డ్ డ్రైనేజీ క్లీనింగ్ మిషన్ల రుణాలకు సంబంధించిన రికవరీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్వరలోనే ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు అర్హులైన దళిత వర్గాలకు చెందిన రైతులకు ఆర్‌బీకేల ద్వారా కిట్లను అందజేస్తామన్నారు. సమావేశంలో కార్యాలయ ఈఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విత్తనం కొంటున్నారా.. ఇవిగో జాగ్రత్తలు

- అనధికార పత్తి విత్తనాలు కొనవద్దు
- లైసెన్ కలిగిన డీలరు వద్దనే తీసుకుని ఆథరైజ్డ్ బిల్లు తీసుకోవాలి
- అనుమానం ఉంటే వైఎస్‌ఆర్ అగ్రి ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకోవచ్చు
- రైతులకు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచనలు


లూజు పత్తి విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాలు పడితే ముందస్తుగా పత్తి, మరికొన్ని పంటలను సాగు చేసుకునేందుకు రైతులు విత్తనాల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో అక్రమార్కులు పత్తిలో నకిలీ విత్తనాలను గ్రామాలకు తరలించినట్లు తెలుస్తోంది. బ్రాండెడ్ విత్తనాల పేరుతో వాటిని రైతులకు కట్టబెట్టేందుకు సమాయత్తమవుతున్నారు. మరికొంత మంది అక్రమార్కులు విత్తనోత్పత్తి పేరిట లూజు విత్తనాలను అమ్మకాలకు సిద్ధం చేసినట్లు సమాచారం. నకిలీలపై ఇటు వ్యవసాయశాఖ, అటు విజిలెన్స్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించలేదు. విత్తనం కారణంగా నష్టపోకుండా రైతులే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నకిలీ విత్తనాలు అమ్మినపుడు ఎటువంటి బిల్లు ఇవ్వరు. ప్రాసెసింగ్, విత్తనశుద్ధి, ఇతర ప్రమాణాలు ఏ మాత్రం ఉండవు. వీటిల్లో ఎటువంటి జన్యు నాణ్యత ఉండదని వ్యవసాయ శాఖ ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ తెలిపారు. ఇటువంటి విత్తనాల అమ్మకాలు గ్రామాల్లో అనధికారికంగా జరుగుతుంటాయి. వ్యవసాయ శాఖ నుంచి లైసన్స్ పొందిన డీలరు దగ్గరే అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలు కొనుగోలు చేసి విధిగా ఆథరైజ్డ్ బిల్లు తీసుకోవాలి. బిల్లులో కొనుగోలు చేసిన విత్తన రకం, గడువు తేదీ, నికర ధర, కంపెనీ పేరు, డీలరు సంతకం, రైతు సంతకం ఉండాలి. పంటకాలం పూర్తి అయ్యే వరకు బిల్లులను భద్రపరుచుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యవసాయ శాఖ అవసరమైనప్పుడు తగిన న్యాయం చేయలేని పరిస్థితి ఉంటుంది. ముఖ్యంగా గడువు దాటిన విత్తనాలను కొనరాదు. అనధికారికంగా అమ్మే విత్తనాలు కొనుగోలు చేయరాదు. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరచిన డబ్బాల నుంచి విత్తనాలు తీసుకోరాదని తెలిపారు. రైతులకు అనుమానం ఉంటే తాము కొనుగోలు చేసిన విత్తనాలను సంబంధిత వైఎస్‌ఆర్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల్లో విత్తనం నాణ్యత, ప్రమాణాలను ఉచితంగా పరీక్షించుకోవచ్చునని సూచించారు. నియోజకవర్గం వారీగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

అప్పుల బాధ తాళలేక..


మృతి చెందిన రైతు ప్రసన్నకుమార్

మద్దికెర : మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో ప్రసన్న కుమార్ (25) అనే రైతు అప్పుల బాధ తాళలేక మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్రభాకర్ అనే వ్యక్తికి ఇద్దరు కుమారులు. రెండవ కుమారుడైన ప్రసన్నకుమార్ తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. గత మూడేళ్లుగా పంటలు కలిసిరాకపోవడంతో దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రామతులసి, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

సీఆర్‌టీ కుటుంబానికి ఆర్థిక చేయూత


మృతుడి భార్యకు కిసాన్ వికాస్ పత్రం అందిస్తున్న డీటీడబ్ల్యూఓ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): నగరంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్‌టీ)గా విధులు నిర్వహిస్తూ గత మార్చి 23న మృతి చెందిన రవినాయక్ కుటుంబానికి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు ఆర్థిక చేయూత అందించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది అందరు కలసి రూ.1.13 లక్షలు సేకరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఈ మొత్తానికి సంబంధించిన కిసాన్ వికాస్ పత్రాన్ని డీటీడబ్ల్యూఓ ఎస్ శ్రీనివాసకుమార్ మృతుడి భార్య కళావతీ బాయికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ద్వారా మృతి చెందిన రోజే ఫినరల్ చార్జీలను అందించామని, మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఇప్పుడు అందించిన దృష్ట్యా ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలను కూడా త్వరలోనే అందజేస్తామన్నారు.


పెట్రోల్ బంకులో చోరీ

- రూ.1.40 లక్షలు అపహరణ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలోని పట్టణ శివారులో ఉన్న పెట్రోల్ బంకులో మంగళవారం చోరీ జరిగింది. కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి అందించిన సమాచారం మేరకు.. మధ్యాహ్న సమయం కావడంతో పెట్రోల్‌బంకు మేనేజర్ కాంతారెడ్డి ఆఫీస్‌కు తాళం వేసి భోజనానికి వెళ్లాడు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆఫీస్ తాళం పగలగొట్టి ర్యాక్‌లో ఉన్న రూ. 1.40 లక్షల నగదు, సెల్‌ఫోన్ అపహరించుకెళ్లారు. భోజనం తర్వాత ఆఫీస్‌కు రాగా తలుపు తెరిచి ఉండటంతో లోనికి వెళ్లి ర్యాక్ పరిశీలించగా నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీలో టెక్నాలజీ వాడేశారు

- కొనసాగుతున్న పోలీసుల విచారణ


కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసిన దృశ్యం

మహానంది: జిల్లాలో సంచలనమైన నంద్యాల కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంతకం ఫోర్జరీ కేసులో పోలీసులు విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రొసిడింగ్స్ తయారీ, సంతకాల ఫోర్జరీ విషయంపై సాంకేతిక పరంగా పోలీసులు మరో కోణంలో విచారణ చేస్తున్నారు. ఈ అంశంలో మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఇప్పటికే క్రాంతినగర్‌కు చెందిన ఉపేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అయితే ఇందులో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఓ వ్యక్తి ఎంఎస్ ఆఫీస్, డెస్క్‌టాప్ పబ్లిసింగ్ వర్క్ చేత పాత ప్రొసిడింగ్ కాపీలను తీసుకుని అచ్చం అలాగే ఉన్నట్లు సృష్టించి వాటిపై డిజిటల్ సిగ్నేచర్ లాగా ఉన్నతాధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో మహానంది తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది ప్రమేయం ఏమైనా ఉందా అన్న కోణంలో విచారణ చేస్తే మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రెవెన్యూశాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

పదోన్నతులు వద్దనుకుంటే తెలపండి

కర్నూలు (సిటీ): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌జీటీ టీచర్లుగా పనిచేస్తున్న వారు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి వద్దనుకునేవారు నేటి సాయంత్రం లోపు నాట్ విల్లింగ్ ఇవ్వాలని డీఈఓ రంగారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించి ఈనెల 17వ తేదీన తాత్కాలిక సీనియారిటీ జాబితాలో ఉన్నవారు ఎవరైనా పదోన్నతులు ఇష్టం లేకుంటే నాట్ విల్లింగ్ ఫామ్‌ను పూర్తిచేసి ఎ.క్యాంప్‌లోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయాలని సూచించారు.